


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 235 | బుధవారం 26- ఆగష్టు 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695




## హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం..

### 50 మంది విద్యార్థులకు డ్రగ్స్ పాజిటివ్



న్యూస్ డెస్క్, 26 ఆగష్టు (కెరటం న్యూస్): హైదరాబాద్ నగరంలో దారుణ ఘటన వెలుగుచూసింది. మహీంద్రా యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం రేగింది. 50 మంది విద్యార్థులకు డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్టు అధికారులు తెలిపారు. కిలోన్నర గంజాయి, 47 గ్రాముల ఓజీ వీడ్ ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మల్నాడు రెస్టారెంట్ యజమాని ఇచ్చిన సమాచారంతో పోలీసులు మహీంద్రా యూనివర్సిటీలో నార్కోటిక్ పోలీసులు సోదాలు నిర్వహించారు.

### "అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు వెళ్దాం"

## కాంగ్రెస్ గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా..!

### బండి సంజయ్ ఘాటు సవాల్



- పీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్ర మంత్రి
- ఓటర్లను అవమానించకండి ప్రజల తీర్పును గౌరవించండి
- దొంగ ఓట్ల ఆరోపణలు తప్పుడు ప్రచారం అంటూ ఖండన
- రోహింగ్యాలకు ఓటర్ ఐడీలు ఎవరు ఇచ్చారు?- సంజయ్ ప్రశ్న

న్యూస్ డెస్క్, 26 ఆగష్టు (కెరటం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మద్దతుతో అధికారంలోకి రాలేదని, అసెంబ్లీని వెంటనే రద్దు చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ప్రజలు మళ్లీ కాంగ్రెస్‌కు ఓటు వేస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సంచలన ప్రకటన చేశారు.

# 30న అసెంబ్లీ సమావేశాలు

### అదేరోజు కీలక మంత్రివర్గ భేటీ

- ఆగస్టు 30 నుంచి అసెంబ్లీ, మండలి సమావేశాలు ప్రారంభం
- మండలి సమావేశాల మొదటిరోజే కీలక మంత్రివర్గ భేటీ
- బీసీలకు 42% రిజర్వేషన్‌పై స్థానిక సంస్థల ఎన్నికల చర్చ
- కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో హాట్ డిబేట్
- డిప్యూటీ స్పీకర్‌గా రాంచందర్ నాయక్ ఎన్నికకు ఏర్పాట్లు
- 2023 తర్వాత తొలిసారిగా శాసనసభలో పూర్తి సమావేశాల షెడ్యూల్
- ప్రతిపక్షాల నుంచి పీసీ ఘోష్ నివేదికపై ప్రభుత్వం కౌంటర్‌కు సన్నద్ధం
- విధాన పరంగా కీలక నిర్ణయాలకు తెర లేపే అవకాశం



న్యూస్ డెస్క్, 26 ఆగష్టు (కెరటం న్యూస్): తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. గవర్నర్ ఆమోదంతో అసెంబ్లీ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 10:30 గంటలకు ఉభయ సభలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో పాలక, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్రమైన చర్చలు సాగనున్నట్లు రాజకీయ వర్గాల్లో అంచనాలు మొదలయ్యాయి.అసెంబ్లీ ప్రారంభమైన అదే రోజు మధ్యాహ్నం 1 గంటకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ సమావేశం జరగనుంది. శాసనసభ భవనంలోని కమిటీ హాల్‌లో జరిగే ఈ భేటీలో రాష్ట్రంలో ఎదురవుతున్న కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

### సర్పంచ్ ఎన్నికల తుది ఓటర్ల జాబితా విడుదలకు

# ఈసీ నోటిఫికేషన్ విడుదల


- సర్పంచ్ ఎన్నికలకు వేగం పట్టిన రాష్ట్ర ఎన్నికల కమిషన్
- తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ జారీ
- సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితా అందుబాటులోకి
- ఆగస్టు 28న మొదటి జాబితా పంచాయతీ కార్యాలయాల్లో ఉంచాలి
- ఆగస్టు 29న రాజకీయ పార్టీలతో సమీక్షా సమావేశం
- ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణకు అవకాశం
- ఎంపీడీవోలు, పార్టీ ప్రతినిధులతో మండల స్థాయి సమావేశాలు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కీలక ఆదేశాలు జారీ





న్యూస్ డెస్క్, 26 ఆగష్టు (కెరటం న్యూస్): తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల కమిషన్ వేగవంతం చేసింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో పాటు అన్ని పార్టీలు కూడా ఎన్నికలకు సన్నద్ధం కావడంతో ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థల ఎన్నికలను కసరత్తును ప్రారంభించింది. త్వరలో ప్రారంభమయ్యే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఫైనల్ ఓటర్ల జాబితాను రూపొందించేందుకు కసరత్తును వేగవంతం చేసింది.

### "బీజేపీలో నాతో ఫుట్‌బాల్ ఆడుతున్నారు!"

చంద్రశేఖర్ తివారీకి ఫుట్‌బాల్ అందజేసి అసంతృప్తి చాటిన ఎంపీ కొండా



### 1,600 ఏళ్లనాటి చతుర్ముఖ నందీశ్వర లింగం వెలుగులోకి



## మాజీ మంత్రి పేర్ని నానిపై కేసు నమోదు

### రెచ్చగొట్టే వ్యాఖ్యలు.. - ఏలూరులో ఎఫ్ఐఆర్



న్యూస్ డెస్క్, 26 ఆగష్టు (కెరటం న్యూస్): రెండు వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా, పోలీసుల పరువు నాశనం చేసేలా చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (నాని)పై కేసు నమోదైంది. ఈ మేరకు ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఎఫ్ఐఆర్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. దెందులూరు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసును నమోదు చేశారు.

### ఉపాధి బిల్లులపై లంచం డిమాండ్




సిద్దిపేట జిల్లా మద్దూరు మండల ఉపాధి హామీ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న ఈసీ బండకింది పర్శ రాములు లంచం తీసుంటూ మంగళవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు

## రాష్టానికి రెయిన్ అలర్ట్

- బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం
- నాలుగు రోజులు భారీ వర్షాలు
- హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



న్యూస్ డెస్క్, 26 ఆగష్టు (కెరటం న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో మరోసారి వర్షాలు చెలరేగనున్నాయి. ఆగస్టు మొదటి వారం నుంచి దాదాపు పది రోజులు వరుసగా కురిసిన వానలు, కొన్నిరోజుల విరామం తర్వాత మళ్లీ తళుక్కుమన్నాయి. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడటంతో రాబోయే నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.



కెరటం న్యూస్



# నాలుగుసార్లు ట్రంప్ ఫోన్ కాల్‌ను కట్ చేసిన మోడీ ?

మొదటిపేజీ తరువాయి

ట్రంప్ పాలనలో భారత్–అమెరికా సంబంధాలు అనేక సార్లు ఒడిదుడుకులకు గురయ్యాయి. ముఖ్యంగా ట్రంప్ ప్రభుత్వం విధించిన అధిక టారిఫ్‌లు, ఇండియాకు వ్యతిరేకంగా తీసుకున్న వాణిజ్య నిర్ణయాలు ఈ సంబంధాల్లో ఉద్రిక్తతకు కారణమయ్యాయి. అమెరికా ఒక వైపు పాకిస్తాన్‌కు మద్దతుగా వ్యాఖ్యలు చేస్తూ, మరోవైపు భారత్‌ను గట్టిగా ప్రెస్ చేయడంపై నరేంద్ర మోదీ అసంతృప్తిగా ఉన్నారని పత్రిక పేర్కొంది.

పాక్‌తో చమురు ఒప్పందాల దిశగా అమెరికా ఆసక్తి చూపిన నేపథ్యంలో, భారత్‌కు మాత్రం రష్యా నుంచి చమురు దిగుమతులపై గీతలు వేయడం మోదీని అసహనానికి గురిచేసినట్టుగా ఆ కథనంలో పేర్కొంది. నాలుగు సార్లు ట్రంప్ ఫోన్ చేసినప్పటికీ, మోదీ స్పందించకపోవడం ఆయన స్పష్టమైన అసంతృప్తిని వెల్లడిస్తోందని జర్మన్ విశ్లేషకులు పేర్కొన్నారు.

అమెరికా తరచూ తానే ప్రపంచ నాయకత్వం వహిస్తున్నట్టు మోస్తున్న ధోరణి గురించి పలు దేశాల్లో విమర్శలు వెలువడుతున్నాయి. "ఇతరుల్ని సూచించడమే తప్పు, తమ తప్పుల్ని గుర్తించని రీతిని అమెరికా ప్రదర్శిస్తోంది," అనే వాదన జర్మన్ మీడియా నుంచి వస్తోంది.

అంతేకాక, భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు చల్లారడం తన విజయం అంటూ ట్రంప్ ఒక సందర్భంలో గర్వంగా చెప్పుకోవడం మోదీకి ఇష్టపడని అంశంగా పేర్కొంది. దీనిపై ఎటువంటి పబ్లిక్ రియాక్షన్ ఇవ్వకుండా మోదీ, ట్రంప్ కాల్‌లను నిర్లక్ష్యం చేయడం తన అసంతృప్తికి ప్రతీకగా అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఇది నిజంగా జరిగిందా లేక ప్రచారమేనా అన్నది అధికారికంగా ఖరారు కాలేదు. కానీ నాలుగు ఫోన్ కాల్స్ నిర్లక్ష్యం చేయడం అనే అంశం ప్రపంచ మీడియాలో చర్చనీయాంశమవుతోంది. మోదీ నిర్ణయం అమెరికా ఒత్తిడికి తలొగ్గకపోవడం అనే సంకేతంగా పలువురు విశ్లేషిస్తున్నారు.

ఈ అంశంపై భారత ప్రభుత్వం స్పందించకపోయినా, జర్మన్ మీడియాలో వచ్చిన కథనం వల్ల ఈ విషయంపై కొత్త చర్చ మొదలైంది. అటు ట్రంప్ ఎందుకు అంతగా ఫోన్ కాల్స్ చేశారన్నది, ఇటు మోదీ ఎందుకు స్పందించలేదన్నది – ఇంకా స్పష్టతకు నోచుకోలేదు. కానీ ఈ ఘటన, భారత్ తన అంతర్జాతీయ నైతికతను ఎలా నిలబెట్టుకుంటుందో చూపించే ఉదాహరణగా నిలుస్తుందా? అనేది ఇప్పుడు ప్రపంచం గమనిస్తున్న ప్రశ్నగా మారింది.

# 1,600 ఏళ్లనాటి చతుర్ముఖ నందీశ్వర లింగం వెలుగులోకి

**న్యూస్ డెస్క్, 26 ఆగష్టు (కెరటం న్యూస్):** హైదరాబాద్ చైతన్యపురిలోని కొసగుండ్ల నరసింహ స్వామి దేవాలయంలో ఒక పురాతన చతుర్ముఖ నందీశ్వర లింగం వెలుగులోకి వచ్చింది. చరిత్రకారుడు డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ ఆదివారం దీన్ని గుర్తించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యపురి ప్రాంతం సుమారు 1,600 ఏళ్ల క్రితం నిర్మించిన గోవిందరాజు విహార అనే హీనయాన బౌద్ధ విహారాన్ని సూచించే శాసనంతో ప్రసిద్ధి చెందింది. ప్రస్తుతం ఆ విహార స్థలాన్ని ఫణిగిరి కొసగుండ్ల నరసింహ స్వామి దేవాలయంగా పిలుస్తున్నారు.ఆ దేవాలయం వెనుక శిథిలాల్లో నందీశ్వర లింగం లభించింది. దాదాపు 2 అడుగుల చదరపు రాతి స్లాబ్‌పై, 4 దిక్కుల్లో ఒక్కోటి 8 అంగుళాల పరిమాణంలో నందులు, వాటి మ?ధ్యలో శివలింగం, దాని చుట్టూ అభిషేక జలాన్ని బయటకు పంపే పానవట్టం చెక్కారు. ఇది దేశంలోనే అతి ప్రాచీన, అరుదైన లింగం అని సత్యనారాయణ తెలిపారు.

# రాష్ట్రానికి బిగ్ రెయిన్ అలర్ట్

మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే గత వర్షాలతో తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలు భారీగా నష్టపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి జిల్లాలు, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో వాగులు వంకలు పొంగిపోయాయి. ప్రస్తుతం ఏర్పడిన అల్పపీడనం వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను ఆనుకొని ఉన్నట్టు అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రెండు రాష్ట్రాల్లో విస్తృత వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు.

హైదరాబాద్ నగరంలో కూకట్‌పల్లి, మియాపూర్, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, నానక్‌రాం గూడ, గోల్కొండ, అత్తాపూర్ ప్రాంతాల్లో ఈ రోజు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాత్రికి వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, ములుగు, భూపాలపల్లి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

రేపు భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. గురువారం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు ఉండబోతున్నాయి. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం తెలంగాణలోని ఎక్కువ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, ములుగు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో మళ్లీ భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని వాతావరణ శాఖ సూచించింది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ అయ్యాయి.

# 30నఅసెంబ్లీ సమావేశాలు

మొదటిపేజీ తరువాయి




ఈ సమావేశాల్లో అత్యంత ప్రాధాన్యత పొందుతున్న అంశం – బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయింపుతో కూడిన స్థానిక సంస్థల ఎన్నికలు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల నిర్వహణ, సీట్ల రిజర్వేషన్, నోటిఫికేషన్ ప్రక్రియ మొదలైన అంశాలపై మంత్రివర్గం లోతుగా చర్చించనుంది.

ఇక అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ప్రవేశపెట్టడం మరో ముఖ్యాంశం. ఈ నివేదికలో పేర్కొన్న లోపాలు, ఆర్థిక వ్యయాలు, వ్యవస్థాపక తప్పిదాలపై సభలో చర్చ జరగనుంది. అన్ని పార్టీల అభిప్రాయాలను సేకరించి, తదుపరి చర్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వనుంది.

మరోవైపు, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కూడా ఈ సమావేశాల్లోనే నిర్వహించే అవకాశముంది. గత డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీగానే ఉంది. అప్పటి నుంచి ప్యానెల్ స్పీకర్లు మాత్రమే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్ నాయక్‌ను డిప్యూటీ స్పీకర్‌గా ఎంపిక చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో 30న జరిగే మొదటి సభలోనే ఆయన ఎన్నిక ప్రక్రియ పూర్తి చేసే అవకాశం ఉంది.రాష్ట్ర రాజకీయాల్లో అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడూ కీలక మలుపులకు కారకమవుతాయి. ఈసారి కూడ నియోజకవర్గాల్లో జరుగుతున్న ఉద్యమాలు, అభివృద్ధి అంశాలపై ప్రభుత్వం తీసుకునే వైఖరి, ప్రతిపక్షాల వ్యూహాలు సభ వేదికపై స్పష్టతకు వస్తాయని విశ్లేషకుల అంచనా. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొలిసారిగా పెద్ద మొత్తంలో సమావేశాలు జరగడం, ప్రజాప్రతినిధుల నుంచి తగిన స్థాయిలో చర్చలు, ప్రశ్నోత్తరాలపై ప్రజల దృష్టి ఉంది.

## "బీజేపీలో నాతో ఫుట్‌బాల్ ఆడుతున్నారు!"

**–చంద్రశేఖర్ తివారీకి ఫుట్‌బాల్ అందజేసి అసంతృప్తి చాటిన ఎంపీ కొండా**



**న్యూస్ డెస్క్, 26 ఆగష్టు (కెరటం న్యూస్):** బీజేపీ లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి తన పార్టీ నేతలపై అసహనం వ్యక్తం చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ పరిధిలో పార్టీ కార్యకలాపాలు సరిగా సాగడంలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి వచ్చినపుడు చేతిలో ఫుట్‌బాల్ పట్టుకుని రావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

పార్టీ వర్గాల సమాచారం ప్రకారం మంగళవారం ఉదయం ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ తివారీని ప్రత్యక్షంగా కలిశారు. తన నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీలో అంతర్గత అనిశ్చితి, సమన్వయ లోపాలపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఆయనకు?ధార్ణాత్మకంగా ఫుట్‌బాల్ అందించారు. "నాతో పార్టీ ఫుట్‌బాల్ ఆడుతోంది!" అనే సందేశం ఇమ్మెడియట్‌గా ప్రచారంలోకి వచ్చింది.

ఈ చర్యతో అకస్మాత్తుగా కంగారుపడిన తివారీ, కొండాతో ప్రత్యేకంగా సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. ఇందులో భాగంగా రంగారెడ్డి రూరల్ మరియు వికారాబాద్ జిల్లాల్లో బీజేపీ నేతలు సక్రమంగా వ్యవహరించడంలేదన్న విషయాన్ని కొండా వివరించినట్టు సమాచారం.

ఈ అంశంపై మాట్లాడిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తనకు పార్టీలో ఎటువంటి అసంతృప్తి లేదని తేల్చిచెప్పారు. "కొంతమంది కావాలనే తప్పుదోవ పట్టించే ప్రచారం చేస్తున్నారు," అంటూ వ్యాఖ్యానించారు.

అయితే, ఆయన బాడీ లాంగ్వేజ్, ఫుట్‌బాల్ వినియోగం ద్వారా తన అసహనం వ్యక్తపరిచిన తీరు బీజేపీ అంతర్గతంగా ఓ మైలురాయిగా మిగిలే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# సర్పంచ్ ఎన్నికలతుది ఓటర్ల జాబితా విడుదలకు ఈసీ నోటిఫికేషన్ విడుదల

మొదటిపేజీ తరువాయి

ఈ క్రమంలోనే గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్రంలో పోలింగ్ కేంద్రాలు, ఫైనల్ ఓటర్ల జాబితా విడుదలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.వార్డుల వారీగా తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 2వ తారీఖున గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 28న గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఆగస్టు 29న జిల్లా ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు.

ఆగస్టు 30న మండల స్థాయిలో ఎంపీడీవోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 28 నుండి 30 వరకు తుది ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించనున్నారు. వాటిని పరిశీలించి సమస్యలను పరిష్కరించనున్నారు. సెప్టెంబర్ 2వ తారీఖును అధికారులు ఓటర్ల ఫైనల్ జాబితాను రిలీజ్ చేయనున్నారు.

## "అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు వెళ్దాం"

# కాంగ్రెస్ గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా..!

మొదటిపేజీ తరువాయి

అధికార పార్టీపై తీవ్రమైన విమర్శలు చేస్తూ కాంగ్రెస్ నేతలకు నేరుగా సవాల్ విసిరారు. "నిజంగా మీకు బలం ఉంటే ముందుకు రండి, అసెంబ్లీ రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉంటారా?" అంటూ ప్రశ్నించారు.



కరీంనగర్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడిన బండి సంజయ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన "దొంగ ఓట్లు వేసి భాజపా ఎంపీలు గెలిచారు" అనే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఓటర్లను అవమానించేలా, ప్రజల తీర్పును అపహాస్యం చేసేలా ఉన్న ఆ వ్యాఖ్యలకు కాంగ్రెస్ నాయకత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. "కరీంనగర్‌లో ఓటేసిన ఓటరు, జగిత్యాలలో మరో ఓటు, చొప్పదండిలో ఇంకో ఓటు వేసినట్టు ఎలా సాధ్యం అవుతుంది? నన్ను 2.25 లక్షల మెజార్టీతో గెలిపించిన ప్రజల పట్ల మీరు ఇలా అనడం తగదు" అని వ్యాఖ్యానించారు.తాను గెలిచిన 8 పార్లమెంట్ నియోజకవర్గాల ప్రజలను అవమానించే విధంగా పీసీసీ అధ్యక్షుడు వ్యాఖ్యానించారని ఆయన అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలన్నారు. దొంగ ఓట్ల ఆరోపణలు నిజమైతే, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచిందని బండి సంజయ్ ప్రశ్నించారు.స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నది అభివృద్ధి కోసమేమీ కాదని, కేంద్ర నిధులు పొందాలనే ఉద్దేశంతో మాత్రమే కాంగ్రెస్ పట్టుదల చూపుతోందని విమర్శించారు. ఓటు బ్యాంకు కోసం రోహింగ్యాలాంటి విదేశీ ప్రవాసులకు ఓటరు కార్డులు, రేషన్ కార్డులు, ఇళ్లను ఇచ్చి వారిని ప్రోత్సహిస్తున్నదెవరు? అని సంజయ్ ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఆయన మరో ఆసక్తికర వ్యాఖ్య చేశారు. "నన్ను గెలిపించిందీ పెద్దలే అయినా... ఓటు వేసే పని పిల్లలే చేయించారు. అందుకే వారికోసం ఏదైనా చేయాలన్న దృక్పథంతోనే సైకిళ్లను పంపిణీ చేస్తున్నా," అని చెప్పారు. మంగళవారం మానకొండూర్ నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 'మోదీ గిఫ్ట్'గా సైకిళ్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో తాడికల్ గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని తన తల్లిదండ్రులు దరిద్రమే జీవితం అని, సైకిల్ తన చదువుకు చాలా ఉపయోగపడుతుందని భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకుంది. ఆ విద్యార్థినిని బండి సంజయ్ ఓదార్చుతూ, "నీ భవిష్యత్తు తలంచుకొని ప్రభుత్వానికి దీటుగా మేము కూడా పని చేస్తాం" అని హామీ ఇచ్చారు.

# మాజీ మంత్రి పేర్ని నానిపై కేసు నమోదు

మొదటిపేజీ తరువాయి

పెదవేగి మండలం కొండలరావుపాలెం గ్రామంలో ఈ నెల 22న జరిగిన సంఘటనను కొనసాగింపుగా వైకాపా నేతలు ఏలూరు ఎస్పీ కార్యాలయానికి చేరుకుని అదనపు ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన పేర్ని నాని తన ప్రసంగంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని చంపుతారా? చంపితే నియోజకవర్గంలో వెయ్యి మంది అబ్బయ్య చౌదరిలు పుడతారు" అంటూ చేసిన వ్యాఖ్యలు సామాజిక వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి. ఆయన చేసిన వ్యాఖ్యలు స్థానికంగా వర్గీయ ఉద్రిక్తతకు దారితీసేలా ఉన్నట్లు పోలీసులు అభిప్రాయపడ్డారు. శాంతి భద్రతలకే ముప్పుగా మారేలా వ్యవహరించారని తెలిపారు.

ఈ నేపథ్యంలో పేర్ని నానిపై ఐపీసీ 153(ఏ), 504, 505(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇందులో వర్గాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు, ఇతరులను ఉద్దేశపూర్వకంగా అవమానించే వ్యాఖ్యలు, సామాజిక విభజనకు దారితీసే ప్రచారాలను అడ్డుకునే నిబంధనలు ఉన్నాయి. పోలీసులు ప్రస్తుతం కేసును దర్యాప్తు దశలో ఉంచారు. కాగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ ఘటనపై ఇంకా అధికారికంగా స్పందించలేదు. అయితే స్థానికంగా వైకాపా కార్యకర్తలు మాత్రం నాని వ్యాఖ్యలు వాస్తవ పరిస్థితులకే ప్రతిబింబమని చెబుతున్నారు. మరోవైపు ప్రతిపక్ష టీడీపీ నేతలు మాత్రం ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు.

రాష్ట్రంలో ఇప్పటికే రాజకీయ విభేదాలు తారాస్థాయికి చేరిన వేళ, ఈ వ్యాఖ్యలు మరింత వివాదాలకు దారి తీసే అవకాశముందని భావిస్తున్నారు. ఈ కేసు పేర్ని నానిపై అరెస్ట్‌కు దారితీస్తుందా అనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది. కేసును పూర్తి స్థాయిలో పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు భంగం కలిగించే ఎలాంటి చర్యలైనా చట్టపరమైన గమ్యం తప్పదని హెచ్చరించారు.

# ఉపాధి బిల్లులపై లంచం డిమాండ్



**న్యూస్ డెస్క్, 26 ఆగష్టు (కెరటం న్యూస్):** సిద్దిపేట జిల్లా మద్దూరు మండల ఉపాధి హామీ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న ఈసీ బండకింది పర్శ రాములు లంచం తీసుంటూ మంగళవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మండలంలో చేసిన 213 ఉపాధి హామీ పనులను టెక్నికల్ అసిస్టెంట్ రికార్డు చేశాడు. అలా పనుల రికార్డులకు ఒక్కోదానికి రూ.200 చొప్పున సర్కారు చెల్లిస్తుంది. 213 పనుల రికార్డులకు రూ.42,500 బిల్లు వస్తుండటంతో వాటిని ప్రభుత్వామోదానికి పంపేందుకు ఈసీ పర్శరాములు రూ.11,500 లంచం అడిగాడు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించిన బాధితుడు.. వారి సూచన మేరకు మంగళవారం కార్యాలయంలోనే పర్శ రాములుకు రూ.11,500 డబ్బు చెల్లించాడు. అక్కడే మాటు వేసిన ఏసీఈ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పర్శరాములును పట్టుకున్నారు.

# హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం...

మొదటిపేజీ తరువాయి



శ్రీ మారుతి కొరియర్ ద్వారా ఢిల్లీ నుంచి డ్రగ్స్ సరఫరా జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. గతంలో నైజీరియన్ నిక నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసి పలు పబ్ లలో విద్యార్థులు పార్టీలు చేసుకున్నట్టు తెలిపారు. డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గంజాయి సేవిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. యూనివర్సిటీలో విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ కు బానిసలు అవుతున్నారని తెలంగాణ యాంటీ నార్కోటిక్ అధికారులు తెలిపారు. ఆషార్ జావేద్, గణేష్, శివకుమార్ లను పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# వినాయక ఉత్సవాలకు రండి సార్

## ఎంపీ వద్దిరాజుకు ఆహ్వానం



హైదరాబాద్ బ్యూరో, 26 ఆగష్టు (కెరటం న్యూస్): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను శ్రీవెంకటేశ్వర కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు టీ.నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఏం.ఉదయ్ కుమారెడ్డిలు కలిసి వినాయక చవితి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు కావలసిందిగా కోరుతూ ఆహ్వానించారు.బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ రెసిడెంట్స్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యాన సెంట్రల్ బ్యాంక్ సమీపాన ఉన్న ఫ్రీడమ్ పార్క్ ఆవరణలో ఈనెల 27 నుంచి 31వతేదీ వరకు వినాయక చవితి సందర్భంగా ఉత్సవాలు జరుపుతున్నట్లు నారాయణ రెడ్డి,ఉదయ్ కుమార్ రెడ్డిలు ఎంపీ రవిచంద్రకు తెలిపారు.ఈ సందర్భంగా ఈనెల 27వతేదీ (బుధవారం)సాయంత్రం జరిగే గణేష్ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావలసిందిగా కోరుతూ వారు ఎంపీ వద్దిరాజును మంగళవారం కలిసి సాదరంగా ఆహ్వానించారు.

## ఎంపీ వద్దిరాజును సత్కరించిన బీఆర్ఎస్ నాయకులు



హైదరాబాద్ బ్యూరో, 26 ఆగష్టు (కెరటం న్యూస్): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు మంగళవారం కలిసి వినాయక చవితి శు భాకాంక్షలు తెలిపారు. భూక్యా చందు నాయక్ (పాల్వంచ),వట్టం రాంబాబు (మణుగూరు), పూజారి వెంకట్ (ఇల్లందు)లు ఎంపీ రవిచంద్రను బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సత్కరించారు, గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర ప్రజలకు ఎంపీ వద్దిరాజు శుభాకాంక్షలు



హైదరాబాద్ బ్యూరో, 26 ఆగష్టు (కెరటం న్యూస్): వినాయక చవితి పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు.ఈ పండుగ సందర్భంగా మనమందరం పర్యావరణానికి మేలు చేసే మట్టి గణపతులను ప్రతిష్ఠించుకుని నవరాత్రోత్సవాలు పూజలు చేద్దామని ఎంపీ రవిచంద్ర పిలుపునిచ్చారు. పాడిపంటలు, సుఖ శాంతులతో తెలంగాణ వర్ధిల్లాలని, సర్వ విఘ్నాలు తొలగిపోవాలని గణనాథుడిని ఎంపీ రవిచంద్ర ప్రార్థించారు.

## మట్టి విగ్రహాలను కొలవండి..! ప్రకృతిని కాపాడండి ఎంపీ వద్దిరాజు పిలుపు



ఖమ్మం బ్యూరో, 26 ఆగష్టు (కెరటం న్యూస్): వినాయక నవరాత్రుల సందర్భంగా ప్రతి ఇంట్లో మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. ఖమ్మంలోని పలువురు ఆధ్యాత్మిక, రాజకీయ ప్రముఖులకు రవిచంద్ర మట్టి విగ్రహాల కిట్లను పంపారు. వాటిని బుర్హాన్ పురంలోని ఆయన క్యాంపు కార్యాలయ సిబ్బంది, బిఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. ఔత్సహిక యువకులు "మోక్ష స్పిర్చువాలిటి" పేరుతో రూపొందించిన కిట్లో 9 రకాల పూజా సామాగ్రితో పాటు మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహం ఉంచారు. ఈ కిట్లను పంచడం ద్వారా ఆధ్యాత్మిక, పర్యావరణ ప్రాధాన్యత తెలిపినట్లు అవుతుందని ఎంపీ రవిచంద్ర తన సందేశంలో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వీటిని పెంపొందించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు ఆకుల గాంధీ, ఎంపీ కార్యాలయ ఇంచార్జి సయ్యద్ ఇస్మాయిల్, వద్దిరాజు యూత్ నాయకులు సుంకర చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతుల బహూకరించిన ఎంపీ వద్దిరాజు




హైదరాబాద్ బ్యూరో, 26 ఆగష్టు (కెరటం న్యూస్): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాలని పిలుపునిస్తూ వినాయక చవితి సందర్భంగా పలువురు ప్రముఖులకు మట్టి గణపతులను బహుకరించారు. ఎంపీ రవిచంద్ర మంగళవారం సాయంత్రం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్,ఆయన అనుచరులు, తన స్వగ్రామం ఇనుగుర్తికి చెందిన పలువురికి మట్టి వినాయకులను అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు.

## ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి గంగులకు ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ ఆహ్వానం



హైదరాబాద్ బ్యూరో, 26 ఆగష్టు (కెరటం న్యూస్): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తదితర ప్రముఖులను ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ ఆహ్వానించింది.కమిటీ నాయకులు పూస నరేందర్,సూర్య విష్ణు,బాల్ కుమార్, వినోద్ యాదవ్, గౌరీశెట్టి వినోద్ తదితర ప్రముఖులు ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్యే కమలాకర్ లను శాలువాలతో సత్కరించి వినాయక చవితి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.

## ఆర్ టీ సి డ్రైవర్ ఆత్మహత్యా యత్నం



ఖమ్మం టౌన్, 26 ఆగష్టు (కెరటం న్యూస్): జి ఎస్ ఆర్ టి సి మణుగూరు డిపో లో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న ఎస్.కె సైదులు సాహెబ్ ని కండక్టర్ తో డ్రైవర్ గా చేసే సర్వీస్ నుండి తొలగించి టిమ్ డ్రైవర్ గా శ్రీశైలం తిరుపతి చార్ట్ లో బలవంతంగా డ్యూటీలు వేసి వెళ్ళవలసిందే అని చార్ట్ దగ్గర సూపర్వైజర్లు, అసిస్టెంట్ మేనేజర్ వేధింపులకు గురి చేస్తున్నందున గతంలో రెండుసార్లు గుండె ఆపరేషన్ అయిన నేను రాత్రి డ్యూటీలు చేయలేనని ఎంత వేడుకున్నా కనికరించకుండా ఉండడంతో డిపో మేనేజర్ ని సైదులు కలవగా డిపో మేనేజర్ నా పరిధిలో లేదు రీజనల్ మేనేజర్ ని కలిసి పర్మిషన్ తెచ్చుకుంటే కండక్టర్ డ్యూటీలు వేస్తాను వెళ్లి రీజనల్ మేనేజర్ ని కలిసి పర్మిషన్ తెచ్చుకుంటే కండక్టర్ డ్యూటీలు ఇస్తానని డిపో మేనేజర్ చెప్పడంతో రీజనల్ మేనేజర్ ని కలవగా రీజనల్ మేనేజర్ దగ్గర సమస్య పరిష్కారం కానందున మనస్తాపం చెందిన ఎస్కే సైదులు డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినారు, రీజనల్ మేనేజర్ గారి ఆదేశానుసారం కండక్టర్ తో డ్యూటీలు చేయవద్దని టిం డ్యూటీలు తప్పకుండా చేయాలని డ్యూటీలు చేయాలని వేధింపులకు గురి చేసినారు, నాకు చదువు రాదు నేను టీమ్ డ్యూటీ లు చేయలేను అని ఎంత చెప్పినా వినకుండా డ్యూటీలు బుక్ చేసి బలవంతంగా విధులకు పంపడం వలన తీవ్ర ఇబ్బందికి గురైన ఎస్.కె సైదులు సాహెబ్ డిపోలో అందరితో నాకు న్యాయం చేయాలని చెప్పుకున్నారు అయినా ప్రయోజనం లేకపోవడం వలన ఆర్ఎం సమస్య పరిష్కరించనందున ఆత్మహత్యాయత్నం కి పాల్పడినారు, ఇట్టి విషయాన్ని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గూడూరు సత్యనారాయణ రీజినల్ ప్రెసిడెంట్ బి ఎస్ రెడ్డి, రీజనల్ సెక్రెటరీ పిల్లి రమేష్ తీవ్రంగా ఖండించినారు, రీజనల్ మేనేజర్ గారు ఒక తండ్రి లాగా కార్మికులను అక్కున చేర్చుకుని సమస్యలు పరిష్కరించాలి కానీ సమస్యలను జటిలం చేయటం కార్మికులను ఇబ్బందులకు గురి చేయటం మంచిది కాదని తెలియజేసినారు. ఇప్పటికైనా ఖమ్మం రీజినల్ మేనేజర్ గారు కార్మికుల లో నెలకొన్న అశాంతిని తొలగించి కార్మిక సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేస్తుందని తెలియజేసినారు.

## రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు.. మాజీ ఎంపీ నామ



హైదరాబాద్ బ్యూరో, 26 ఆగష్టు (కెరటం న్యూస్): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి శుభఫలితాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. మతసామరస్యాన్ని పెంపొందించే ఈ పండుగను అందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని, వినాయక చవితి పర్వదినం పర్యావరణహిత పండుగ కావాలని, మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పర్యావరణ సంరక్షణలో భాగస్వాములు కావాలని నామ పిలుపునిచ్చారు. వినాయకుడి ఆశీస్సులతో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో సకల విజయాలు సాధించేందుకు గణనాయకుడి కృప లభించాలని నామ కోరుకున్నారు.

## ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న

### త్రివేణిలో మదర్ తెరిసా జయంతి సందర్భంగా ఛారిటీ కార్యక్రమాలు



ఖమ్మం బ్యూరో, 26 ఆగష్టు (కెరటం న్యూస్): మిషనరీస్ ఆఫ్ చారిటీస్ స్థాపించి దీనులకు సేవ చేసిన భారతరత్న మదర్ తెరిసా జయంతి సందర్భంగా త్రివేణి పాఠశాలలో విద్యార్థులు తెచ్చిన పళ్ళు , బ్రెడ్, బిస్కెట్స్ మొదలైన వాటన్నిటిని ఒకచోట చేర్చి ఖమ్మం నగరంలో గల వివిధ అనాథ శరణాలయాలకు వృద్ధాశ్రమాలకు పంపించడం జరిగింది. ఇక్కడ విద్యార్థుల ద్వారా సేకరించబడిన పండ్లు ఇతర ఆహార పదార్థాలను వృద్ధులకు పంపిణీ చేశారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ చెప్పే మాటలు కంటే చేసే పనుల వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని సాయం చేయాలనేటువంటి మాటలతో కాక చేతలలో దానిని చూపించాలని విద్యార్థులు మానవ సేవను అలవాటు చేసుకున్నట్లయితే అది మాధవ సేవ అని అన్నారు. ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు సేవా గుణాన్ని కలిగి ఉండాలని దీనుల పట్ల జాలి దయ కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చారిటీలో భాగంగా జై జవాన్ జై కిసాన్ కార్యక్రమానికి గవర్నర్ గారికి ఒక లక్ష రూపాయలు విరాళం అందచేసిన విషయం గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వర్ రావు గారు పాఠశాల సిఆర్ఓ మురళీకృష్ణ వైస్ ప్రిన్సిపల్ స్వప్న ముస్తఫా క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యాంటీ ర్యాగింగ్ పై యస్.బి.ఐ.టి. లో సదస్సు



ఖమ్మం ఎడ్యుకేషన్, 26 ఆగష్టు (కెరటం న్యూస్): ర్యాగింగ్ విద్యార్థుల జీవితాలను చిద్రం చేస్తుందని ఖమ్మం ఖానాపురం హవేలీ సబ్ ఇన్స్పెక్టర్ గౌతమి తెలిపారు. మంగళవారం స్థానిక యస్.బి.ఐ.టి. కళాశాలలో యాంటీ ర్యాగింగ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ఇన్స్పెక్టర్ గౌతమి మట్లాడుతూ ఏవిధమైన దుశ్చర్య అయినా అది మాటల ద్వారా కాని, చేతల ద్వారా కాని, మానసికంగా కాని, సెక్సువల్ గా కాని ఇతరులకు ఇబ్బంది కలిగించడం ర్యాగింగ్ గా పరిగణిస్తారని, విద్యార్థులు తెలిసితెలియక అజ్ఞానంలో ఇటువంటి తప్పిదాలకు పాల్పడి జీవితాలను నాసనం చేసుకోవద్దని సూచించారు. తమ కళాశాలలోని విద్యార్థులు క్రమశిక్షణను అవలంబించడం ద్వారా ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్ గా నిలబడగలిగామని, విద్యార్థుల మధ్య సఖ్యతను పెంపొందించడం ద్వారా సీనియర్ జూనియర్ అనే భేదం లేకుండా చేయగలిగామని యస్.బి.ఐ.టి. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ర్యాగింగ్ కు బాధితులైన వారు ఆత్మవిశ్వాసం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడే అవకాశం ఉన్నందున ఇతరులతో పంచుకోవడం ద్వారా ధైర్యము పొందగలరని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా. జి. ధాత్రి తెలిపారు. పిల్లలలోని మార్పులను తల్లిదండ్రులు గమనించాలని కళాశాల ప్రిన్సిపల్ డా. జి. రాజ్ కుమార్ తెలిపారు. ర్యాగింగ్ కు పాల్పడిన, బాధితులైన వారి వ్యక్తిత్వాన్ని గమనించాలని, మార్పులు చిన్నవిగా ఉన్నప్పుడే కౌన్సిలింగ్ అందిచాలని సూచించారు. తమ కళాశాలలోని యాంటీ ర్యాగింగ్ కమిటీని విద్యార్థులు వినియోగించుకొని తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా. ఎ.వి.వి. శివ ప్రసాద్, డా. జె. రవీంద్రబాబు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## త్రివేణిలో మహాగణపతికి మహానీరాజనం



ఖమ్మం బ్యూరో, 26 ఆగష్టు (కెరటం న్యూస్): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో వివిధ రూపాలలో పర్యావరణహిత వినాయక విగ్రహాలను తయారుచేసి విగ్రహాలకు శాస్త్రోచిత పూజలను నిర్వహించి విద్యార్థులకు ప్రసాదాలను పంచడం జరిగింది. విద్యార్థులకు ఎకో ఫ్రెండ్లీ గణేశ విశిష్టతను తెలిపేలా కరపత్రం ను పంచారు. తల్లిదండ్రులకు ప్రత్యేకంగా ఎకో ఫ్రెండ్లీ గణేశ కాంపిటీషన్ ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ విఘ్నేశ్వరుని ఆరాధన అంటే విఘ్నేశ్వరుని రూపంలోని ప్రత్యేకతలు అర్థం చేసుకొని మానవులు దానికి అనుగుణంగా జీవనము కొనసాగించాలని తెలియజేస్తూ విఘ్నేశ్వరుని రూపంలో ఏనుగు తల బుద్ధి బలానికి పెద్ద బొజ్జ సృష్టి యోగ రహస్యాలు కలిగిన స్థానం చిన్ని కన్నులు తీక్షణమైన దృష్టికి పెద్ద చెవులు చక్కని మాటలు వినడానికి నాలుగు భుజాలు చతుర్విధ పురుషార్థాల సాధనకు మూషిక వాహనం కోరికలను అదుపులో ఉంచుకోవడానికి చిహ్నాలు అని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తల్లిదండ్రుల పట్ల భక్తికి బుద్ధి బలానికి అద్భుతమైన కార్యశక్తికి విఘ్నేశ్వరుడు చిహ్నమని వినాయక నవరాత్రులు అంటే కేవలం ఉత్సవం కాదని అది మానవ జీవనానికి పరిణామం అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణేశుని స్మరిస్తూ భక్తి శ్రద్ధలతో పాటలు పాడుతూ మరియు నృత్యాలు చేస్తూ అలరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ముస్తఫా క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులను పూజిద్దాం



**హైదరాబాద్ బ్యూరో, 26 ఆగష్టు (కెరటం న్యూస్):** ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర ఆధ్వర్యంలో హైదరాబాదులో వివిధ పాఠశాలల్లో పర్యావరణ అవగాహన సదస్సు లు మట్టి గణపతి పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సదస్సుకు ప్రపంచ పర్యావరణ సంస్థ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అప్పికొండ అనురాధ అధ్యక్షతన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ చాముండేశ్వరి పీఠాధిపతి శ్రీకృష్ణ చాముండేశ్వరి స్వామి వారు పాల్గొని గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంబించారు . ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు, తల్లిదండ్రులకు తమ పీఠం ఆధ్వర్యంలో గత నాలుగు దశాబ్దాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం "మట్టి గణపతులను పూజిద్దాం మహాగణపతిని పూజిద్దాం "అన్న నినాదం తో ఈ అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది అన్నారు. ప్రముఖ అంతర్జాతీయ పర్యావరణవేత్త సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాయుడు గారు మాట్లాడుతూ మన ప్రపంచ పర్యావరణ సంస్థ పర్యావరణ పరిరక్షణ మహా ఉద్యమంలో ఎన్నో అద్భుతమైన విజయాలు సాధించింది. ఖైరతాబాద్ భారీ గణపతి విగ్రహం దగ్గర 2017వ సంవత్సరంలో "మట్టి గణపతిలే ముద్దు ముద్దు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దు వద్దు" అన్న భారీ ర్యాలీని ఏర్పాటు చేసి ఖైరతాబాద్ ఉత్సవ సమితికి విజ్ఞప్తి చేయడం మూలంగా ఈరోజు ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కార్యక్రమాలు మహాగణపతి విగ్రహాన్ని కూడా మట్టితోనే ఏర్పాటు చేయడం నిజంగా ప్రపంచ పర్యావరణ సంస్థ కృషి అభినందనీయమని గురూజీ గారి సందర్భంగా పేర్కొన్నారు. డాక్టర్ సిహెచ్ భద్ర గారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ గణపతి ఉత్సవాలలో ప్రతి ఒక్కరు ఆనందంగా పండుగ జరుపుకుంటూ పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల మూలంగా చెరువులు, నదులు, కుంటలు ,సరస్సులు, సముద్రాలు పూర్తిగా కలుషితం అయిపోయి అందులో ఉన్న జీవవైవిధ్యం పూర్తిగా అంతరించిపోయే ప్రమాదంలో ఉందన్నారు. విశిష్ట అతిథి శ్రీ జ్ఞాన భారతి హై స్కూల్ కరస్పాండెంట్ వై అశోక్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఒక్కరం వినాయకుని ఆదర్శంగా తీసుకొని తల్లిదండ్రులని గురువులని పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి మాట్లాడుతూ విద్యాలయాలు దేవాలయాలు పర్యావరణ పరిరక్షణ కేంద్రాలుగా ప్రపంచ పర్యావరణ సంస్థ భవిష్యత్తులో భారీ కార్యక్రమాలు భారీ సదస్సులు నిర్వహించబోతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ కోశాధికారి కేంద్ర ప్రభుత్వ ఆహార పంపిన సలహా మండలి సభ్యులు రిజ్వాన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అన్ని మతాలు అన్ని కూరలు అన్ని ప్రాంతాలు ఈరోజు ఏకం కావడం ఐక్యంగా పనిచేయడం తప్ప మరొక ప్రత్యామ్నాయం లేదన్నారు అన్ని మతాలల్లో దైవం ప్రకృతి ప్రకృతిని కాపాడుకుంటే దైవాన్ని కాపాడుకున్నట్లే అన్నారు ఈ కార్యక్రమంలో సంస్థ పిఆర్ఓ శ్రావణ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాలలో పర్యావరణ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది దేశవ్యాప్తంగా ప్రతిరోజు లక్షలాది విద్యార్థులను చైతన్య ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ప్రమోద్ కుమార్ పాల్గొని పర్యావరణం కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరి జీవితంలో నిత్య నూతన కార్యక్రమం అన్నారు. కార్యక్రమం అనుసంధానకర్త వై ప్రణయ్ మాట్లాడుతూ మట్టి విగ్రహాణం ఆరాధించడంతో మనమందరం దైవా అనుగ్రహానికి మరింత దగ్గర అయినట్లు అన్నారు.

## యూరియా కొరతకు కారణం కేంద్ర బిజెపి ప్రభుత్వమే

### సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు




**వైరా టౌన్, 26 ఆగష్టు (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతకు ప్రధాన కారణం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమేనని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. సిపిఐ(ఎం) వైరా డివిజన్ కమిటీ సమావేశం తాళ్ళపల్లి కృష్ణ అధ్యక్షతన వైరా పార్టీ కార్యాలయం బోడేపూడి భవనంలో జరిగింది. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అవసరమైన మేరకు యూరియా అందించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే యూరియా సరఫరాను పెంచాలని, రైతులకు అవసరమైన మేరకు యూరియా రియా అందించాలి డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం పార్టీ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న పెసర, పత్తి పంటల రైతులకు నష్టపరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గ్రామంలో ప్రజలు విష జ్వారలతో త్రీవంగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక వైద్యశాలలో డాక్టర్లు, సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో గ్రామ, గ్రామాన పర్యటించి సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. వైరా మున్సిపాలిటీలో పెండింగులో ఉన్న పనులు పూర్తి చేయాలని, కారేపల్లి, ఏన్కూర్ మండలాల్లో 50 పడకల ఆస్పత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై జరుగు పోరాటాలలో ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నాయకులు సుంకర సుధాకర్, కొండబోయిన నాగేశ్వరావు, దుగ్గి కృష్ణ, వైరా డివిజన్ కమిటీ సభ్యులు దోంతబోయున నాగేశ్వరరావు, కే.నరేంద్ర, బాణాల శ్రీనివాసరావు, చేరుకుమల్లి కుటుంబరావు, తోట నాగేశ్వరావు, బాధవత్ శ్రీనివాసరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, వజ్జా రామారావు, దొడ్డపనేని కృష్ణార్జునరావు, తూము సుధాకర్, మంగటి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## షాకింగ్ లుక్‌లో దర్శనమిచ్చిన సమంత.. ప్రశాంతతను ఎంచుకుంటున్నానంటూ పోస్ట్




**మూవీ న్యూస్, 26 ఆగష్టు (కెరటం న్యూస్):** టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఇటీవల నిర్మాతగా కొత్త జర్నీ స్టార్ట్ చేసింది. చాలా రోజుల తర్వాత 'శుభం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరించడంతో పాటు ఇందులో కీలక పాత్రలో నటించి అందరినీ నవ్వించింది. అయితే ఈ చిత్రం ఏప్రిల్ 27న విడుదలై పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. అంతేకాకుండా నిత్యం పలు ఇంటర్వ్యూలో పాల్గొంటూ వార్తల్లో నిలుస్తోంది. అలాగే త్వరలోనే 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇక గతంలో లాగా ఒకేసారి 5 చిత్రాలు కాకుండా నాణ్యత కలిగింది ఒక్కటే చేస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే.

ఎంత బిజీగా ఉన్నప్పటికీ సమంత పలు యాడ్స్, పాడ్‌కాస్ట్ అంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. అంతేకాకుండా పలు హాట్ ఫొటోలు సైతం షేర్ చేస్తోంది. తాజాగా, సమంత కొన్ని హాట్ ఫొటోలు షేర్ చేసింది. ఇందులో బ్లాక్ కలర్ స్లీవ్‌లెస్ ధరించి ఆమె మత్తెక్కించే చూపులతో అందరినీ మెస్మరైజ్ చేస్తుంది. ఈ ఫొటోలకు.. పరిశుభ్రతను ఎంచుకోవడం అంటే.. ప్రశాంతతను ఎంచుకోవడం. శుభ్రంగా ధరించడం అంటే జాగ్రత్తగా ఉండడం" అని ఉన్న కొటేషన్ షేర్ చేసింది. ఇక సమంత ఫొటోలను చూసిన నెటిజన్లు సూపర్ అంటున్నారు. మరికొందరు మాత్రం షాక్ అవుతున్నారు. అసలు సమంతకు ఏమైంది ఇలా మారిపోయిందని ఆందోళన చెందుతున్నారు

## 'మాస్ జాతర' వాయిదా

### చివరి నిమిషంలో రవితేజ అభిమానులకు బిగ్ షాకిచ్చిన మూవీ మేకర్స్



**మూవీ న్యూస్, 26 ఆగష్టు (కెరటం న్యూస్):** మాస్ మహారాజా రవితేజ, శ్రీలీలకాంబినేషన్‌లో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'మాస్ జాతర'. ఈ సినిమా రవితేజ 75వ ప్రాజెక్ట్‌గా రాబోతుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. భాను బోరవరపు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్స్, సాంగ్స్ ప్రేక్షకుల్లో హైప్ పెంచాయి.

ఇక ఈ మూవీ ఆగస్టు 27న థియేటర్స్‌లోకి రాబోతుందని ఇప్పటికీ మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఎప్పుడెప్పుడు వస్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో.. తాజాగా, 'మాస్ జాతర' మూవీ మేకర్స్ చివరి నిమిషంలో రవితేజ అభిమానులకు బిగ్ షాకిచ్చారు. రేపు విడుదల కావట్లేదని ప్రకటించారు. "ఆగస్టు 27న 'మాస్ జాతర'ను విడుదల చేయడం లేదు. సమ్మెలు, కీలకమైన సన్నివేశాలు పూర్తి చేయడంలో ఊహించని జాప్యం కారణంగా సినిమాను అనుకున్న తేదీకి సకాలంలో షూటింగ్ ఫినిష్ చేయలేకపోయాము.

కంగారుగా సినిమా రిలీజ్ చేయడం కంటే సమయం తీసుకొని ది బెస్ట్ ఇవ్వాలనుకుంటున్నాము. రవితేజ అభిమానులకు గొప్ప అనుభూతిని అందించాలనే ఈ నిర్ణయం తీసుకున్నాము. త్వరలో థియేటర్లలో మీకు అతిపెద్ద మాస్ ఫీస్ట్‌ను అందించడానికి బృందం ఎంతగానో కృషి చేస్తోంది. త్వరలోనే కొత్త రిలీజ్ తేదీని ప్రకటిస్తాము" అని రాసుకొచ్చారు. అంతేకాకుండా రవితేజ పోలీస్ డ్రెస్ వేసుకున్న పోస్టర్‌ను షేర్ చేశారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న రవితేజ అభిమానులు షాక్ అవుతున్నారు.